

జాతీయస్థాయి పోటీలకు పద్మావతి కళాశాల విద్యార్థిని

విశాలాంధ్ర-నరసన్నపేట: జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీలకు స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని, బెవర హారిక ఎంపికైందని కళాశాల డైరెక్టర్, సి.హెచ్. దుర్గాప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో జరుగుతున్న 37వ రాష్ట్ర అంతర్ జిల్లా అథ్లెటిక్ పోటీల్లో రన్నింగ్ విభాగంలో ప్రథమ స్థానము కైవసం చేసుకుని బంగారు పతకం సాధించింది. అలాగే లాంగ్ జంప్ విభాగంలో వెండి పతకం గెలుచుకొని, ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. క్రీడల్లో ప్రతిభ చూపిన హారికను కళాశాల ప్రిన్సిపాల్, ఈ ఎం. నాయుడు, అకడమిక్ ఇంచార్జ్, మూకళ్ళ శ్రీనివాస్, ఏవో, మెండ మోహన్ దాస్ నాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

జెడ్పీ సీఈవో గా శ్రీధర్ రాజు పదవీ బాధ్యతలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా ఎల్.ఎన్.వి. శ్రీధర్ రాజ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల బదిలీల జరిగిన నేపథ్యంలో శ్రీధర్ రాజ విజయనగరంలో డిపిఓగా విధులు నిర్వహించి శ్రీకాకుళం జడ్పీ సీఈవో గా పదవీ బాధ్యతలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ లను జిల్లా పరిషత్ లో ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు.

జిల్లా పంచాయతీ అధికారిగా భారతి సౌజన్య బాధ్యతలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : జిల్లా పంచాయతీ అధికారిగా కె. భారతి సజన్య సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. బదిలీ ప్రక్రియలో భాగంగా భారతి సౌజన్య కాకినాడ డిపిఓగా విధులు నిర్వహించి బదిలీ పై శ్రీకాకుళం డిపిఓ గా సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ లను జిల్లా పరిషత్ లో మర్యాద పూర్వకంగా కలిశారు.

పింఛన్లు మంజూరు చేయాలి

విశాలాంధ్ర-పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, 19వ వార్డు, సూదికొండ గ్రామానికి చెందిన నిరుపేద వితంతు మహిళలకు సామాజిక పింఛన్లు మంజూరు చేయాలని వార్డ్ కౌన్సిలర్ ప్రతినిధి శిష్టు గోపి కోరారు. ఈ మేరకు సోమవారం పలాస ఆర్డీవో సుదర్శన్ దొరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి నెలలో ఆన్ లైన్ చేసిన తరువాత గత ప్రభుత్వం హయాంలో అందులో కొంత మందికి పింఛన్లు మంజూరు అయ్యాయని అయితే ఎన్నికల నిబంధనల కారణంగా అధికారులు లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ నిలిపివేసారన్నారు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇప్పటి వరకు ఒక్క కొత్త సామాజిక పింఛను కూడా మంజూరు చేయలేదని, అలాగే ఇటీవల భర్తలు చనిపోయిన చాలా మంది వితంతు మహిళలు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ వ్యాప్తంగా ప్రభుత్వం వారు అందించే సామాజిక పింఛన్లు కోసం ఎదురు చూస్తున్నారన్నారు. దీనికి తోడు చాలా మంది నిరుపేద అభాగ్యులు ఎటువంటి ఆర్థిక భరోసా లేక పూట గడవక చాలా ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం తక్షణమే అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సూదికొండ వైసీపీ నాయకుడు బగాది సింహాచలం, దళిత నాయకుడు దుమ్ము.రాజు, వితంతు మహిళలు పైల అమ్మాయమ్మ, దంతగిరి.రాజేశ్వరి, దండాసి వాణి, పల్లెటి నారాయణమ్మ, జోగి.లక్ష్మమ్మ, పాలవలస.జ్యోతిలు ఉన్నారు.

మందస తహాశీల్దార్‌గా హైమావతి

విశాలాంధ్ర-మందస: మందస మండల తహాశీల్దార్‌గా హైమావతిని ప్రభుత్వం నియమించింది. సోమవారం మండల టీడీపీ అధ్యక్షులు భావన దుర్యోదన ఆమెను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎరువులు అధిక ధరలకు అమ్ముతున్నారని, దీనివలన రైతాంగం నష్టపోతుందని, తహాశీల్దార్ స్పందించి అధిక ధరలకు అమ్ముతున్న ఎరువుల షాపులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మోటారు బైక్ చోరీ

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : మండలంలోని అరిణాం అక్కివలస పంచాయతీ పట్టుశాలిపేట గ్రామానికి చెందిన వేకువోలు తవుడు తన ఇంటి ముందు పార్కింగ్ చేసిన మోటారు బైక్ చోరీకి గురైనట్టు సోమవారం ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ సందీప్కుమార్ తెలిపారు. ఈ నెల 4వ తేదీ రాత్రి తన ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్ను 5వ తేదీ ఉదయం చూసే సరికి కన్పించలేదని తవుడు తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

తిరుపతిలో ప్రదర్శనలు ఇచ్చిన బోరుభద్ర కోలాటం బృందం

విశాలాంధ్ర-సంతబొమ్మాలి: సంతబొమ్మాలి మండలం బోరుభద్ర గ్రామానికి చెందిన గ్రామానికి చెందిన కోలాట బృందం మహిళలు కలియుగ దేవుడైన ఆదిదేవుడు తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి సన్నిధానంలో సోమవారం కోలాట నృత్య ప్రదర్శనలు చేశారు. బోరుభద్ర కోలాట బృందం కు తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి ఈనెల 7న కోలాట నృత్యం ప్రదర్శనలు చేసేందుకు ఆహ్వానం వచ్చింది. ఈ మేరకు కోలాటం నృత్యం బృందానికి చెందిన మహిళలు ఆదివారానికి తిరుమల తిరుపతి దేవస్థానానికి చేరుకున్నారు. వీరు ప్రదర్శనలు చేసిన దృశ్యాలు భక్తులకు ఆకట్టుకున్నాయి.

పంచాయతీ అభివృద్ధిలో వార్డు మెంబర్లు కీలకం

విశాలాంధ్ర-కవిటి: పంచాయతీల అభివృద్ధిలో ఉప-సర్పంచ్,వార్డు మెంబర్లే కీలకమని ఎంపీడీవో శ్రీనివాస రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉప-సర్పంచులు, వార్డు మెంబర్లకు రీఫ్రెష్ శిక్షణ కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థిక సంఘం నిధుల వినియోగం,గ్రామ పంచాయతీలో పన్నుల వసూళ్ళు, ఆర్థికాభివృద్ధి, పంచాయతీల సంపూర్ణ అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఈవోపీఆర్డీ శివాజీ పాణిగ్రహి, ట్రైనీలు అబ్దుల్ ఖాన్, జ్యోతి, ఉపసర్పంచ్లు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

నందిగాంలో విషాదం

ఆర్మీ జవాన్ మృతి

విశాలాంధ్ర-నందిగాం: రైలు నుంచి జారిపడి నందిగాంకు చెందిన జి జగదీశ్వర్ రావు 37 అనే ఆర్మీ జవాన్ మృతి చెందాడు. జగదీశ్వరరావు బీహార్ లో ఉద్యోగం చేస్తున్నారు. సెలవు పై ఇంటికి వచ్చేందుకుగాను పశ్చిమబెంగాల్ రాష్ట్రం కలకత్తా నుంచి రైలులో వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. రైల్వే పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. జగదీశ్వరరావుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు భార్య శోభారాణి బాబు జై వర్ధన్ (12) పాప చాందిని (9) ఈ విషయం విన్న గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

గృహ నిర్మాణాల లక్ష్యాలు సాధించాలి

- నిర్మాణాలు వేగవంతం చేయాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: గృహ నిర్మాణ లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరం నుండి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీఓలు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలతో గృహ నిర్మాణాలపై జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ లతో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణాలు ప్రారంభం కాని వాటిపైనా దృష్టి సారించాలని ఆదేశించారు. ఇసుక అందుబాటులో ఉంటుందని తెలిపారు. లే అవుట్స్ లో విద్యుత్, నీరు, తదితరమైన మౌలిక వసతులు ఉండాలన్నారు. గృహ నిర్మాణాలను మౌలిక సహాయకులు, ఇంజనీరింగ్ సహాయకులు నిర్వహించే విధులు ఎంపిడిఓలు, మున్సిపల్ అధికారులు స్వయంగా వెళ్లి పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలన్నారు. జిల్లాలో గృహాలకు నిర్ణయించే లక్ష్యాలను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. గుత్తేదారులతో మాట్లాడి నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. మండలాల వారీగా, మున్సిపాలిటీల వారీగ ఆయన సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్ లో శ్రీకాకుళం, టెక్కలి ఆర్డీవోలు కె. సాయి ప్రత్యూష, ఎం. కృష్ణమూర్తి, హౌసింగ్ ఇన్ చార్జ్ పీడీ జి. నగేష్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి జరగాలంటే పంచాయతీలు పరిపుష్టత అవసరం

అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ మోహన్

విశాలాంధ్ర- జలుమూరు: గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నా పంచాయతీల్లో ఉన్న పరిస్థితులు మెరుగు పడాలంటే గ్రామానికి పాలకులే మూలస్తంభాలని పంచాయతీరాజ్ రాష్ట్ర సహాయ సంచాలకులు కృష్ణమోహన్ అన్నారు. మండల కేంద్రంలో జలుమూరు సర్వసభ్య సమావేశంలో సోమవారం జరిగిన ఉప సర్పంచ్‌మండల సభ్యుల శిక్షణ శిబిరాల్లో పాల్గొని మాట్లాడారు గతంలో కన్నా సోమవారం పంచాయతీల అభివృద్ధికి మంచి నిధులు కూడా అందుతున్నా యని ప్రభుత్వం కూడా ప్రత్యేక దృష్టి పెట్టిందని అన్నారు. ఈ శిక్షణ లో జిల్లా, రాష్ట్రం నుండి వచ్చిన అధికారులు సూచనలను పాటించి పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమావేశంలో మండలాభివృద్ధి అధికారి కే. అప్పలనాయుడు, పంచాయతీ విస్తరణ అధికారి పి. ఉమామహేశ్వరరావు, డిటిఎమ్ పిఎస్ టి వో టి ఉప సర్పంచ్లు సభ్యులు పాల్గొన్నారు.

పైడిభీమవరం చెక్ వద్ద పటిష్ట నిఘా ఉంచాలి

చెక్‌పోస్టు ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వర రెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాకుళం: పైడిభీమవరం జాతీయ రహదారివద్ద పటిష్ట నిఘా ఉంచాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. జిల్లా సరిహద్దు చెక్ పోస్ట్ వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ?ంగా తనిఖీ చేసి అక్రమ రవాణా అరికట్టాలని జిల్లా ఎస్పీ శ్రీ కేవీ మహేశ్వర రెడ్డి సూచించారు. పైడిభీమవరం వద్ద ఉన్న చెక్ పోస్టును జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ లతో ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వాహనాలను తనిఖీ చేసేందుకు పాక్షికంగా ఒక షెడ్ వేయాలని, అక్కడ లైటింగ్ తక్కువగా ఉందని మరింత లైటింగ్ పెంచాలని ఆదేశించారు. వాహనాలు ఆపేందుకు స్టాపర్ ఏర్పాటు చేయాలన్నారు. చెక్ పోస్టు వద్ద సిబ్బందిని పెంచి బలోపేతం చేయాలని ఆదేశించారు. చెక్ పోస్టు వద్ద మౌలిక సదుపాయాలు పెంచాలన్నారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్,ఎస్పీ, వాహనాల తనిఖీల సరళిని పరిశీలించారు. ఈ తనిఖీలో శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి కె. సాయి ప్రత్యూష, తహసీల్దార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలం : సీపీఐ

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : నిత్యావసరాల ధరలు నియంత్రించడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందని సీపీఐ నాయకులు బలగ శ్రీరామ్మూర్తి ఆరోపించారు. సోమవారం విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ ముందు పేద,మధ్యతరగతి ప్రజల ఓట్లు కోసం కూటమి ప్రభుత్వం పూర్ టూ రిచ్ అంటూ ఆరాటంగా ప్రచారం చేశారని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటినా ఎటువంటి మార్పు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2014 నుండి 2019 బాబు పాలనలో ఏమి జరిగిందో ప్రజలు మరువలేదని గుర్తు చేశారు. విద్యుత్ రేట్లు పెంచమని హామీ ఇచ్చి మరలా డిస్కంలు పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజలపై భారం మోపుటకు సిద్ధపడు తుందని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ భారాలు తగ్గించమని పోరాడుతున్న ఉద్య మకారులపై కాల్పులు జరిపి ప్రాణాలు బలిగొన్న భాషీర్బాగ్ సంఘటన ప్రజలు మరువలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధరలు నియంత్రణకు స్థిరీకరణ నిధి కేటాయించి, ప్రభుత్వమే పెరిగిన ధరలు బరించి పేద,మధ్య తరగతి,సామాన్య ప్రజలపై భారం పడకుండా రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పంచిరెడ్డి అప్పారావు, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షణ్ముఖ రావు,భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఉప్పాడ సూర్యనారాయణ,ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు చుక్క రాము,మహిళా సమాఖ్య నాయకురాలు సతివాడ నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతోనే పంచాయతీల అభివృద్ధి

- గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి
- వైసీపీ పాలనలో వార్డు మెంబర్లు జీరో... వాలంటీర్లు హీరో
- ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: పక్కా ప్రణాళికలు తయారు చేయడం ద్వారానే పంచాయతీలు అభివృద్ధికి నోచుకుంటాయని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వార్డు సభ్యులు, ఉపసర్పంచ్, గ్రామ కార్యదర్శులకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ పంచాయతీల నిర్వహణలో ఉపసర్పంచ్ లు,వార్డు మెంబర్ లు, కార్యదర్శులు పరస్పర అవగాహనతో గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా పారిశుధ్యం, వీధి లైట్ల నిర్వహణ తదితర అంశాలు పై మరింత అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రజావసరాల దృష్ట్యా గ్రామ పంచాయతీలు తప్పనిసరిగా కొన్ని అంశాలపై దృష్టి పెట్టి పని చేయాల్సిన బాధ్యత పాలకవర్గంపై ఉందన్నారు. పంచాయతీలో చేయాల్సిన విధులు, బాధ్యతలు, పరిపాలన, అధికారాలు వంటివి తెలుసుకోవాలన్నారు. గత వైసీపీ పాలనలో వార్డు మెంబర్లను జీరోలను చేస్తూ వాలంటీర్లను హీరోలను చేశారన్నారు. పాలకులు, అధికారులు ఎప్పుడూ సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల భజనే చేశారన్నారు. దీనికి ప్రాయశ్చిత్తం వైసీపీ ప్రస్తుతం అనుభవిస్తోందన్నారు. ప్రజాప్రతినిధులు పోరాడాలని.. మీకు వచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని మీ గ్రామాన్ని కొంతైనా అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఎన్ఆర్ఈ జీఎస్ ఓ మహత్తర పథకమని... ఇండియా లోనే ఈ పథకాన్ని గొప్ప గుర్తింపుఉందన్నారు. ఈ పథకం ద్వారా గ్రామాలను బాగు చేసుకోవాలన్న చిత్తశుద్ధి స్థానిక ప్రజాప్రతినిధుల్లో ఉండాలని తెలిపారు. మూడున్నరేళ్ల ఎలా గడిచిపోయిందో మరిచి పోండి... రానున్న ఏడాదిన్నర కాలం అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. తనకు అభివృద్ధి ఒక్కటే అభిమతమని, పార్టీతో సంబంధం లేకుండా పని చేస్తానని చెప్పారు. వార్డు మెంబర్లుగా మీ హక్కులు తెలుసుకొని వాటిని సాధించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

ఆక్రమణలో మందస ప్రధాన రహదారి

అభివృద్ధి పనులకు అడ్డంకి

ఆక్రమణలకు గురైన మందస రోడ్డు

విశాలాంధ్ర-మందస: మందసలో ప్రధాన రహదారి అభివృద్ధి పనులు ఇంకా పూర్తి కాకుండానే రోడ్డుకు ఇరువైపులా బాహాటంగా ఆక్రమణ లు జరుగుతున్నాయి. దీంతో బస్సులు, లారీలు, ఇతర వాహ నాలు రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. రోడ్డు అభివృద్ధి పనులకు సహకరించకుండా రోడ్డు ఆక్రమణలకు ఆక్రమణదారులు పాల్పడుతుండడంతో చర్చనీయాంశమైంది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మందసలో ప్రధాన రహదారి అభివృద్ధి పనుల కోసం 2014-19 సంవత్సరంలో టీడీపీ ప్రభుత్వం మాజీ మంత్రి గౌతు శివాజీ కృషి ఫలితంగా 4 కోట్లు మంజూరయ్యాయి. అప్పట్లో రోడ్డు అభివృద్ధి పనులు రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ పనులు ప్రారంభమయ్యాయి. ఈ నిధులు చాలకపోవడంతో వైసీపీ ప్రభుత్వం హయాంలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మరో రెండు కోట్లు రూపాయలు అదనంగా మంజూరు చేయించారు. బస్సు షెల్టరుకు కూడా నిధులు మంజూరు చేయించి ఆగిపోయిన రోడ్డు పనులు జరిగేలా చర్యలు చేపట్టారు. అయితే ప్రస్తుతం రోడ్డు అభివృద్ధి పనులు పూర్తికాకుండా నిలిచిపోయాయి. రోడ్డు అభివృద్ధిలో భాగంగా నిర్మించిన సిమ్మెంట్ కాలువలు ఆక్రమదారులు పూడ్చేశారు. రోడ్డుకు ఇరువైపుల ప్లాట్‌ఫారం నిర్మించడానికి ఎంపికైన స్థలం కూడా ఆక్రమణలకు గురైంది. కాలువలు, ప్లాట్‌ఫారం స్థలాలు అక్రమిం చడంతో కాకుండా కొత్తగా నిర్మించిన తారు రోడ్డును ఆక్రమించి భవనాలతో పాటు షెడ్లు నిర్మిస్తున్నారు. రోడ్డు ఆక్రమణలు జోరుగా జరుగుతుండడంతో బస్సులు, ఇతర వాహనాలు ఈ రోడ్డుపై నడపాలంటే వాహన చోదకులకు కష్టతరంగా మారింది. రోడ్డు ఆక్రమణలపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టకుండా చోద్యం చూస్తుండడంతో ఈ పరిస్థితి నెలకొంది. కాగా తారు రోడ్డు మధ్యలో డివైడరు నిర్మాణం పనులు, విద్యుత్ దీపాలంకరణ వంటి పనులు పూర్తి కాలేదు. మందస నుంచి ఉమ్మాగిరి గ్రామ జంక్షన్ వరకు డబుల్ తారురోడ్డు పనులే ఇంక పూర్తి కాలేదు. రోడ్డు అభివృద్ధి పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని రోడ్డు ఆక్రమణలు తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

స్వచ్ఛ సిటీగా శ్రీకాకుళం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: శ్రీకాకుళం నగరాన్ని స్వచ్ఛసిటీగా మార్చేందుకు కృషి చేయాలని, ప్రజలతో ముడిపడి ఉన్న పారిశుధ్య వ్యవస్థపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని శ్రీకాకుళం నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు కలెక్టరేట్‌లో మున్సిపల్ అధికారులతో సోమవారం సాయంత్రం ఆయన సమీక్ష నిర్వహించారు. నగరపాలక సంస్థ పరిధిలోని పారిశుధ్యంలో స్పష్టమైన మార్పు దిశగా చర్యలు తీసుకోవాలని, అభివృద్ధి, పరిపాలనలో ప్రాధాన్యతలను ముందుగా గుర్తించాలని చెప్పారు. పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, రాత్రి వేళల్లో పారిశుధ్య నిర్వహణ పనులు మరింత మెరుగు పడాలని సూచించారు. ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరును మాత్రమే పరిగణనలోనికి తీసుకుంటామని స్పష్టం చేశారు. శానిటేషన్ డ్రైవ్ సరిగ్గా జరగడం లేదనే ఫిర్యాదు ఒక్కటి కూడా రాకూడదని, అలాంటి చోట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. చెత్తను విచక్షణా రహితంగా వేయకూడదని ప్రజలను ఆలోచింప జేయాలన్నారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా, పన్నుల వసూళ్లు, కార్పొరేషన్ ఆదాయ వ్యయాలపై ఆయన ఆరా తీశారు. చెత్త పేరుకుపోయిన ప్రాంతాలను గుర్తించి డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలని, భవిష్యత్తులో ఇంటింటి చెత్త సేకరణ పూర్తిగా జరిగేలా 'డస్ట్‌బిన్ ఫ్రీ సిటీ'గా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో కమిషనర్ పివివిడి ప్రసాదరావు, మున్సిపల్ ఇంజనీర్ పీవి.గంగాధరరావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వి.సుధీర్ కుమార్, టీపీఓ ఉమా మహేశ్వరరావు, హార్టికల్చర్ ఏడి వి.ప్రసాద్, వై.శివ శంకర్, పలువురు ఇంజనీరింగ్ అధికారులు హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: మండలంలోని పొన్నాడ బ్రిడ్జి రోడ్డులో సోమవారం జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి గాయపడ్డాడు. పొన్నాడ గ్రామానికి చెం దిన పాకల శ్యామలరావు అనే వ్యక్తి మోటారు ద్విచక్ర వాహనంపై పొన్నాడ వైపు వెళ్తుండగా.. ఎదురుగా వస్తుండగా ఆటో ఢీకొంది. ఈ సంఘటనలో గాయపడిన శ్యామలరావును చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వి.సందీప్కుమార్ తెలిపారు.

వివాహిత అదృశ్యం

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : మండలంలోని పొన్నాడ గ్రామానికి చెందిన ఓ వివాహిత తన ఇద్దరు పిల్లలతో కలిసి ఈ నెల 5వ తేదీన కన్నవారింటికి వెళతానని చెప్పి కన్పించకుండా పోయిందని ఆమె భర్త కె. అప్పలరాజు సోమవారం ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ సందీప్ కుమార్ తెలిపారు. పిల్లలకు దసరా సెలవులు కావడంతో ఆమె తన పిల్లలతో కలిసి ఆటోలో తన కన్నవారింటికి వెళతానని చెప్పి అదృశ్యమైందని ఫిర్యాదులో చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

జిల్లా అధికారులు హాజరు తప్పనిసరి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : జిల్లా అధికారులు హాజరు తప్పనిసరిగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికను సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అర్జీ దారులు నుండి కలెక్టర్ తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అర్జీలు స్వీకరించారు. ఇంత వరకు అర్జీలు పరిష్కరించలేని అర్జీలు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. పంచాయతీ రాజ్, పౌర సరఫరాలు, తదితర శాఖల్లో పెండింగ్ లో ఉన్న అర్జీలపై సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, విద్యా శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విభిన్న ప్రతిభా వంతులు, తదితర శాఖలకు సంబంధించి ఆయన అర్జీలు స్వీకరించారు. అర్జీలు స్వీకరణలో జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, డిఆర్డిఎ పిడి కిరణ్ కుమార్ లు స్వీకరించారు. 129 ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ సభ్యులు ఉదారత

విశాలాంధ - కవిటి : సోంపేట మండలంలోని మండపల్లి గ్రామానికి చెందిన దిక్కల హనీష్ అనే చిన్నారి బాబు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఇప్పటికే బాబు వైద్యం కోసం తల్లిదండ్రులు పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చు చేశారు. తదుపరి చికిత్స కోసం సుమారు 25 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్‌జీఎఫ్ సభ్యులు బి.చరణ్ వారి మిత్రబృందంతో కలిసి విరాళాలు సేకరించి ఎస్‌జీఎఫ్ సంస్థ నిధికి అందించడంతో, ఎస్‌జీఎఫ్ ముఖ్య సభ్యులు విన్నింటి వేణుబాబు హైదరాబాదులో చికిత్స పొందుతున్న హనీష్ ను పరామర్శించి చిన్నారి తల్లి దండ్రులకు ఎస్‌జీఎఫ్ సంస్థ తరుపున 72 వేల, 412 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ సభ్యులు మాట్లాడుతూ మిగతా స్వఛ్ఛంద సంస్థలు మరియు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ చిన్నారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వీడియో జర్నలిస్ట్ కుటుంబానికి ఆర్థిక సాయం

రూ.61 వేలు అందించిన ఏపీయూడబ్ల్యూజే

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : ఇటీవల తీవ్ర అనారోగ్యంతో మరణించిన వీడియో జర్నలిస్ట్ గుణ కుటుంబానికి ఏపీయూడబ్ల్యూజే, అనుబంధ సంఘాల తరఫున రూ. 61,500ను, ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు సోమవారం ఉదయం అందించారు. జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు అసోసియేషన్ రూ.51,500 అందించగా, గరిమెళ్ళ ప్రెస్ క్లబ్ రూ.10 వేలును అందించారు. ఈ సందతరేగా జర్నలిస్టు నాయకులు దివంగత గుణకు నివాళులర్పిస్తూ, అతని భార్యకు ప్రభుత్వ విభాగంలో ఏదైనా ఉపాధి అవకాశం కల్పించాలని స్థానిక శాసనసభ్యులు గొండు శంకర్ కు, కలెక్టర్ కు త్వరలో కలిసి వినతిపత్రం ఇవ్వాలని నిర?యించారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్ ఈశ్వరరావు, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పైడి బాలక్రిష్ణ, మొదలవలస వాసు, రాష్ట్ర నాయకులు వి.ఎస్‌నాయుడు, ప్రెస్ క్లబ్ కార్యదర్శి ఎస్.నవచైతన్య, కోశాధికారి చౌదరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నందిగాంలో విషాదం...ఆర్మీ జవాన్ మృతి

విశాలాంధ్ర - నందిగాం : రైలు నుంచి జారిపడి నందిగాంకు చెందిన జి జగదీశ్వర్ రావు 37 అనే ఆర్మీ జవాన్ మ ృతి చెందాడు. జగదీశ్వరరావు బీహార్ లో ఉద్యోగం చేస్తున్నారు. సెలవు పై ఇంటికి వచ్చేందుకుగాను పశ్చిమబెంగాల్ రాష్ట్రం కలకత్తా నుంచి రైలు లో వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి తీవ్రంగా గాయ పడి మ ృతి చెందాడు. రైల్వే పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. జగదీశ్వరరావుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు భార్య శోభారాణి బాబు జై వర్ధన్ (12) పాప చాందిని (9) ఈ విషయం విన్న గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నూరుగా వినిపిస్తున్నారు.

పంచాయతీ ఆదాయ, వ్యయాలను తెలుసుకోవాలి : మాస్టర్ ట్రైనీ ముకుందరావు

విశాలాంధ్ర - నరసన్నపేట : గ్రామ పంచాయతీకి వచ్చే ఆదాయ, వ్యయాలను పంచాయతీ వైస్ సర్పంచులు, వార్డు మెంబర్లు తెలుసుకోవాలని సామర్లకోట ఏపీ.ఆర్.జి.ఎస్.ఏ మాస్టర్ ట్రైన్, ముకుందరావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏపీ.ఆర్.జి.ఎస్.ఏ కార్యాచరణ ప్రణాళిక-2024-25 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందతరేగా మాస్టర్ ట్రైనీ, ముకుందరావు మాట్లాడుతూ వైస్ సర్పంచులు, వార్డు మెంబర్లు వివిధ శాఖల పనితీరును సమీక్షించడానికి, బడ్జెట్ వివరాలను ప్రజలకు తెలియ చెప్పడానికి, అర్హులైన లబ్ధిదారులను వివిధ పథకాలకు ఎంపిక చేయడానికి, పంచాయతీకి పన్నులు బకాయిలు ఉండేవారిని ప్రశ్నించడానికి, కొత్త పన్నులు వేయడానికి, వ్యవసాయ ఉత్పత్తులు, పోరంబోకు భూములు తెలియ చెప్పడానికి పూర్తి వివరాలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, బొడ్డేపల్లి మధుసూదన్ రావు, యుటిపిఆర్డి, మొజ్జాడ రేణుక, మేజర్ పంచాయతీ వైస్ సర్పంచ్, సాసుపల్లి క ృష?బాబు, పెద్ద బొరిగివలస వైస్ సర్పంచ్, తంగి తారకేశ్వరరావు, చిన్న బొరిగివలస వైస్ సర్పంచ్, మొయ్యి రమేష్, కరగాం వైస్ సర్పంచ్, తోట శ్రీనివాసరావు, తామరపల్లి వైస్ సర్పంచ్, కోల సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

కలమటను కలసిన ఏపీ వాణిజ్య కార్పొరేషన్ చైర్మెన్ వజ్జ...

విశాలాంధ్ర - కొత్తూరు : మండలం మాతల గ్రామంలో శ్రీకాకుళం జిల్లా టీడీపీ అధ్యక్షులు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు మాజీ శాసనసభ్యులు కలమట వెంకటరమణ మూర్తి నిమర్యాదపూర్వంగా కలసిన. ఏపి.వాణిజ్య కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి న తరువాత వజ్జ బాబురావు కలిశారు యువత ఉద్యోగాలు అని అనుకోకుండా వాణిజ్యపరంగా.ఏదాగాలి అని ఏపి.టి.డి.సి చైర్మెన్ వజ్జా అన్నారు.

జిల్లా స్థాయి క్విజ్ పోటీలో కొత్తపల్లి విద్యార్థులు ప్రతిభ

విశాలాంధ్ర - మందస : మండలం సువర్ణపురంలో జరిగిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో కొత్తపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం కైవసం చేసుకుందని ఇన్‌చార్జీ ప్రధానో పాధ్యాయులు ఎస్.గణేశ్వర రావు ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల్లో విద్యార్థులకు తర్ఫీదును ఇస్తున్న ఉపాధ్యాయులు ఎస్.కిరణ్‌కుమార్, జి.భీమారావు, ఎం.లక్ష్మణరావు, ఎస్.అబ్రహం, పి.రాంబాబు, ఎం.చిత్రసేను, బి.రమేష్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

మైనర్లు ద్విచక్ర వాహనాలు జోలికి వెళ్లొద్దు : ఎస్ఐ ఖాదర్ బాషా

విశాలాంధ్ర - మందస : మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వద్దని సంబంధిత తల్లిదండ్రులకు మందస ఎస్.ఐ ఖాదర్ బాషా హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం హరిపురం జంక్షన్ పరిధిలో పలువురు వాహన దారులకు కౌన్సిలింగ్ చేస్తూ ద్విచక్ర వాహనదారుడు వాహనాన్ని నడిపేటప్పుడు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని సంబంధిత పేపర్లను తన వద్ద ఉంచుకోవాలని సూచించారు . అగంతకులు ద్విచక్ర వాహనాలపై గ్రామాల్లోకి పట్టణాలలోకి వస్తూ దొంగతనాలకు పాల్పడుతున్నారని ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరు ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు సంబంధిత పేపర్లను తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా దసరా సెలవుల నేపథ్యంలో హాస్టల్ నుండి సెలవు పై ఇంటికి వచ్చిన విద్యార్థులకు సంబంధిత తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలు ఇస్తూ రోడ్డుపై అతివేగంతో ప్రయాణం చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారని ఎట్టి పరిస్థితుల్లో మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని చట్ట విరుద్ధంగా ప్రవర్తిస్తే సంబంధిత తల్లిదండ్రులకు శిక్ష తప్పదని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కటకటాలు తప్పవని ఎస్సై ఖాదర్ భాషా వాహనదారులకు హెచ్చరించారు

గాంధీజీ కళలు గన్న గ్రామాభివృద్ధే ధ్యేయం : ఎంపీపీ కిల్లీ ఉషారాణి

విశాలాంధ్ర - పొందూరు : పంచాయితీలు ప్రగతి పథంలో నడిపేందుకు గాంధీజీ కల్లగన్న గ్రామాభివ ృద్దే ధ్యేయంగా పనిచేయాలని ఎంపీపీ కిల్లి ఉషారాణి అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో నిర్వహించిన వార్డు సభ్యులు ఉప సర్పంచుల శిక్షణా తరగతుల్లో పాల్గొని పై విధంగా అన్నారు.పంచాయితీలు ప్రగతి పథంలో నడిపేందుకు కీలక సూత్రధారులు మీరేనన్నారు. ప్రజలు ఓటు ద్వారా ఇచ్చిన గౌరవాన్ని, నమ్మకాన్ని వ ృధా చేయకుండాపంచాయితీల అభివ ృద్ధికి పాటు పడాలన్నారు.గాంధీజీ కళ లగన్న పల్లెల అభివ ృద్ధికి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళిక ద్వారా అభివృద్ధి ప్రగతి పథంలో నడిపించాలన్నారు.పల్లెల్లో పంచాయితీ పాలకవర్గమే అభివ ృద్ధికి మూల స్తంభాలని ఎంపీడీవో మన్మధరావు, ఈఓఆర్డి సింహాచలంలు పంచాయితీల పాలకవర్గం అభివ ృద్ధికి బాధ్యతలు పై విపులం గా వివరించారు. ఈ కార్యక్రమంలో మండల నలుమూలల నుండి వచ్చిన ఉప సర్పంచులు వార్డు మెంబర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అగ్నాస్త్రం కషాయం తయారు

విశాలాంధ్ర - మక్కువ : మన్యం జిల్లా మక్కువ మండలం దుగ్గేరు యూనిట్ పనసభద్ర గ్రామంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పి. షణ్ముఖరాజు ఆదేశాలు మేరకు అగ్నాస్త్రం కషాయం తయారు చేయడం జరిగింది. యూనిట్ ఇంఛార్జి ఉర్లక నాగార్జున మాట్లాడుతూ కాయ తొలిచు, కాండం తొలిచు పురుగులు, ఇతర పురుగులు నివారణకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో అగ్నాస్త్రం బాగా పనిచేస్తుందని, ఈ కషాయం ఎకరానికి రెండు నుండి మూడు లీటర్లు వంద లీటర్లు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఏఏ జాగాన చంద్రశేఖర్, ఫార్మర్ సైంటిస్ట్ గులివందల అశోక్, ఐసీఆర్పీలు సీదరపు పాపారావు, దీసరి వెంకటరావు, కొండతామర అప్పలరాజు, రెడ్డి సుందరరావు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాపూజలు

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : మండలం బైపల్లి గ్రామంలో సోమవారం దుర్గాదేవి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీగటి రామారావు, కామేశ్వరరావు, మైలపల్లి ధనరాజు దంపతులు పాల్గొని ఘనంగా పూజలు నిర్వహించారు.

గ్రామసభలలో ప్రతి ఒక్క సభ్యుడు బాధ్యతగా హాజరు కావాలి

విశాలాంధ్ర - మక్కువ : పంచాయితీలలో అభివృద్ధి సంక్షేమం కోసం జరిగే గ్రామసభలలో ప్రతి ఒక్క సభ్యుడు బాధ్యతగా హాజరుకావాలని ఎంపీడీవో డిడి స్వరూప రాణి అన్నారు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన పంచాయతీ ప్రతినిధుల సమావేశంలో అవి మాట్లాడారు ముందుగా పంచాయతీ ప్రతినిధులను పరిచయం చేసుకున్నారు అనంతరం ఈవోపీఆర్డి దేవకుమార్ మాట్లాడుతూ సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్లకు కూడా పంచాయతీల అభివృద్ధిలో భాగస్వామ్యం ఉందని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ పంచాయతీ చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు ఈ కార్యక్రమంలో అన్ని పంచాయతీల నుండి గ్రామ కార్యదర్శులు ఉపసర్పంచులు వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

పీఎం యశస్వి పథకం ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర - బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లాలో 2024-25 విద్యా సం.కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పిఎం యశస్వి పథకం కింద ఉపకార వేతనాలు పొందుటకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఎస్.కృష్ణ తెలిపారు.

జావెలిన్ త్రో పోటీల్లో రుషికుమార్‌కు ద్వితీయ బహుమతి

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : రాష్ట్ర స్థాయి జావెలిన్ త్రో పోటీల్లో సంతబొమ్మాళి మండలము, బోరుభద్ర గ్రామానికి చెందిన మార్పు రుషికుమార్ కు ద్వితీయ బహుమతి లభించింది. రాష్ట్ర విద్యాశాఖ అధ్వర్యంలో నిర్వహించిన స్కూల్ జేమ్స్ పోటీల్లో పాల్గొని మెడల్ తో, పాటు మెరిట్ సర్టిఫికెట్ పొందారు. ఈ విద్యార్థి విజయం సాధించిటం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

క్రీడలతోనే ఆరోగ్యం : ఎమ్మెల్యే గౌతు శిరీషా

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : క్రీడలతోనే మానసిక ఉల్లాసం, ఆరోగ్యం కలుగుతుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషా అన్నారు. సోమవారం మండలంలో ఉద్దాన రామక్రిష్టాపురం గ్రామంలో జిల్లా స్థాయి కబాడీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కబాడీ అసోసియేషన్ అధ్యక్షులు వెంకన్నచౌదరి మాట్లాడుతూ జిల్లాలో రాష్ట్ర స్థాయి కబాడీ పోటీలు నిర్వహించడానికి ప్రయత్నాలు జరుగుతుందని అన్నారు. ఈ పోటీల్లో 105 టీములు పాల్గొన్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ చింతాడ హేమారావు, మాజీ సర్పంచ్ చింతాడ నారాయణ, మాజీ ఎంపిటిసి గౌరకల వసంతస్వామి, పుచ్చ ఈశ్వరరావు, దువ్వాడ హేంబాబు, కర్ని రమణలు పాల్గొన్నారు.

మహా చండీ దేవిగా పూజలందుకున్న దుర్గాదేవి

విశాలాంధ్ర - సంతబొమ్మాలి : ఈ మండలం బోరుభద్ర గ్రామంలో నెలకొల్పిన దుర్గాదేవి కనకదుర్గ అమ్మవారి వద్ద, 5వ రోజైన సోమవారం మహా చండీ దేవిగా దుర్గాదేవి పూజలు అందుకున్నారు. దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సందతరేగా బోరుభద్ర బస్టాండ్ లో నెలకొల్పిన దుర్గాదేవి విగ్రహం వద్ద, భక్తులు గత ఐదు రోజుల నుంచి పూజలు చేస్తున్నారు. పురోహితులు బూరాడ శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో మహా చండి రూపంలో ఉన్న దుర్గాదేవికి సోమవారం షోడసోపచార పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. పూజా కార్యక్రమంలో గ్రామస్తులు, భవానీలు పాల్గొన్నారు.

హనుమాన్ హెల్పింగ్ హాండ్స్ సంస్థ సభ్యులు దాతృత్వం

విశాలాంధ్ర - కవిటి : మండలంలోని వడ్డీ జల్లుపుట్టుగ గ్రామానికి చెందిన జయసేన్, సుకంతి జెన్నాల పెద్ద కుమారుడు జస్వంత్ జెన్న 13 ఏండ్ల వయసులో గుండెకు సంబంధించిన వ్యాధి తో బాధపడుతున్నాడు విషయాన్ని తెలుసుకున్న హనుమాన్ హెల్పింగ్ హాండ్స్ సంస్థ సభ్యులు 15 వేలు రూపాయలు వైద్య ఖర్చులకోసం అందజేసి తమ దాతృత్వం చాటుకున్నారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి జస్వంత్‌కు ఆర్థిక సాయం అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ హెల్పింగ్ హాండ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆదిలక్ష్మి కుటుంబాన్ని పరామర్శించిన వైకాపా నాయకులు

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : సంతబొమ్మాళి గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి కుటుంబ సభ్యులైన వెలమల తిరుపతిరావు మాత ృమూర్తి వెలమల ఆదిలక్ష్మి మ ృతి చెందటంతో, ఆ కుటుంబాన్ని వైకాపా నాయకులు సోమవారము పరామర్శించారు. ప్రఘాడ సంతాపాన్ని వ్యక్తం చేసారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ, ఇటీవల స్వర్గస్తులైన విషయం తెలుసుకొని జడ్పీటీసీ సభ్యులు పాల వసంతరెడ్డి, మండల పీఏసీఎస్. ధ్యక్షులు కెళ్ళి గోవిందరావు జగన్నాయుకులు, మండల పార్టీ అధ్యక్షులు కోత సతీష్, పీఏసీఎస్ డైరెక్టర్ మార్పు నాగభూషణరావు, సంతబొమ్మాళి పంచాయతీకి చెందిన కొన్న శ్రీరాములు, అట్టాడ మోహనరావు, పప్పు అప్పన్న, వాదాల దుర్గారావు, గున్న దినేష్, కర్రి లక్ష్మణరావు ఉన్నారు.

లా యూనివర్శిటీ టీచింగ్ అసోసియేట్‌గా తోలాపి యువతి

విశాలాంధ్ర - పొందూరు : ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన ఫలితాలలో నేషనల్ లా యూనివర్శిటీ టీచింగ్ అసోసియేట్గా తోలాపి గ్రామానికి చెందిన యువతి దుంపల అపర్ణ ఎంపికైంది. దామోదర సంజీవయ్య నేషనల్ లా యూనివర్శిటీలోనే ఎంపిల్ పూర్తి చేసి పీహెచ్డీ చేస్తున్న అపర్ణ అదే యూనివర్శిటీలో టీచింగ్ అసోసియేట్గా ఎంపిక కావడం విశేషం. బీసీ-ఏ కోటాలో ఒకే టీచింగ్ అసోసియేట్ పోస్టు ఉండగా ఈ పోస్టుకు అపర్ణ ఎంపికైంది. చదువుకున్న లా యూనివర్శిటీలోనే ఫ్యాకల్టీగా ఎంపిక కావడం అపర్ణ ప్రతిభకు నిదర్శనం. యువతి తల్లిదండ్రులు దుంపల శ్రీనివాసరావు సుశీల ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. నేషనల్ లా యూనివర్శిటీకి టీచింగ్ అసోసియేట్గా ఎంపిక కావడం పట్ల కుటుంబసభ్యులు, గ్రామస్తులు బంధువులు యువతిని అభినందించారు.